క్లుప్తంగా

హైకోర్టు జడ్జికి సన్మానం



శరత్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

బూర్గంపాడు: భద్రాచలంకు చెందిన హైకోర్టు న్యాయమూర్తి కాజా శరత్‌ను శుక్రవారం బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో బసచేసిన జడ్జిని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్యతో కొడాలి శ్రీనివాస్, భజన సతీష్, వసంతరావు, కార్తీక్, గౌతమ్‌కుమార్ తదితరులు సన్మానించి పలు అంశాలపై చర్చించారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు



ప్రశంసా పత్రం అందుకుంటున్న కిషన్‌రావు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఉత్తమ సేవలందిస్తున్న పలువురికి గురువారం 78వ స్వతంత్ర్య దినోత్సవం సందర్భంగా భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ప్రశంసా పత్రాలు అందజేశారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రి మత్తు వైద్య నిపుణులు మల్లేష్, డిప్యూటీ డెమో వైద్య ఆరోగ్య శాఖ ఎండి ఫైజ్ మోహిఉద్దీన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ జి.కాంతమ్మ, చర్ల, మణుగూరు మెడికల్ ఆఫీసర్లు శ్రావణ్ కుమార్, శ్రీధర్, లైన్‌మెన్ అన్నపురెడ్డి జగన్‌మోహన్ రెడ్డిలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అదే విధంగా భద్రాచలం ఎంవీఐ కిషన్‌రావుకు, డీటీఓ సదానందం ప్రశంసాపత్రం అందించారు.

రాఖీల బుకింగ్‌కు ప్రత్యేక కౌంటర్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీడిపో ఆధ్వర్యంలో ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాలకు రాఖీలను పంపించేందుకు లాజిస్టిక్స్ విభాగంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసిన్నట్టు భద్రాచలం డిపో మేనేజర్ తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కరకగూడెం: నేడు 33/11కేవీ కరకగూడెం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1 వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కరకగూడెం విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.
ములకలపల్లి: మండలకేంద్రంతోపాటు, జగన్నాథపురం సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీనర్సింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హిందూ సంఘాల నిరసన



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

అశ్వారావుపేట: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు ఖండించాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం అశ్వారావుపేటలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక రింగ్ సెంటర్ లో మానవహారం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

నేడు వైద్యుల సమ్మె

భద్రాచలంఅర్బన్: కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనకు నిరసనగా శనివారం వైద్యులు సమ్మె చేస్తున్నట్టు ఐఎంఏ భద్రాచలం అధ్యక్షుడు మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా అత్యవసర సేవలకు మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

భద్రాచలంటౌన్: వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై నిరసనగా ఈ నెల 21న జరిగే భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లాడి పాల్‌రాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏఎంసీ కాలనీలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు ఐకమత్యంగా ఈ బంద్‌లో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో చింతూరు డివిజన్ అధ్యక్షుడు డేగల వంశీ, పుట్టి రవి, నక్కా సందీప్, కనకరాజు, డేగల శివయ్య, దశింబాబు, బన్నీ, నాని, వినయ్, పల్లాంటి వెంకన్న, ప్రవీణ్ ప్రకాశ్, చిన్నా, సంజీవ్ పాల్గొన్నారు.

వెలుగుకి బాట పడేదెన్నడు?

అటవీశాఖ అనుమతి లేక అంధకారం
- 17 ఏళ్లుగా చీకట్లోనే బాటన్న నగర్
- నాడు బడి.. చేతిపంపు ధ్వంసం
- నేడు అన్నీ ఉన్నా.. తప్పని కరెంటు గోస



విద్యుత్ సౌకర్యానికి నోచుకోని బాటన్న నగర్

గుండాల: నాడు పిల్లల చదువు కోసం బడి కట్టుకుంటే కాల్చేశారు.. తాగునీటి కోసం వేసిన చేతిపంపును ధ్వంసం చేశారు. నేడు అడవిలో ఊరు ఉండటూ కరెంటు సౌకర్యం కోసం ఆటంకం కలిగిస్తున్నారు. బతుకుదెరువు కోసం 26 ఏళ్ల క్రితం వచ్చి ఇళ్లు నిర్మించుకున్నామని, జిల్లా అధికారులే స్వయంగా ఆధార్, రేషన్ కార్డులు ఇచ్చారని, పాఠశాల, అంగన్‌వాడీ భవనాలు నిర్మించారని, ఇలా అన్నీ ఇస్తున్నప్పటికీ అటవీశాఖ మాత్రం కరెంటు కోసం అనుమతి ఇవ్వడం లేదనేది ఏళ్ల తరబడి చీకట్లో మగ్గుతున్న బాటన్ననగర్ గ్రామస్తుల ఆవేదన.

26 ఏళ్ల కిత్రం వలసవచ్చిన గొత్తికోయలు

చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుంచి 1998 సంవత్సరంలో గుత్తికోయ కుటుంబాలు వలస వచ్చారు. గుండాల–ఇల్లెందు మార్గం మధ్యలో క్రిష్టాపురంపాడు అడవిలో నివాసాలు ఏర్పాటు చేసుకుని తొమ్మిదేళ్ల పాటు జీవనం కొనసాగించారు. అయితే మాజీ జెడ్పీటీసీ బాటన్న ఆధ్వర్యంలో ఆ కుటుంబాలను రోడ్డు పక్కన ఉండాలని సూచించడంతో అక్కడ గుడిసెలు వేసుకున్నారు. ఈ క్రమంలోనే గ్రామస్తులు కిష్టాపురం పాడును బాటన్న నగర్‌గా పేరు మార్చుకున్నారు. ఆ తర్వాత వారికి ఆధార్, రేషన్ కార్డులు మంజూరు చేశారు. ప్రస్తుతం ఆ గ్రామంలో 40 కుటుంబాలు నివసిస్తున్నాయి

కలెక్టర్ చొరవతో పాఠశాల భవనం..

గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్ రజత్‌కుమార్ శైనీ మండలాన్ని పర్యటించిన క్రమంలో బాటన్న నగర్ గ్రామాన్ని సందర్శించారు. అప్పుడే పాఠశాల, అంగన్‌వాడీ భవనాలకు నిధులు మంజూరు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ఆ గొత్తికోయ కుటుంబాలకు పోడు భూముల పట్టాలు సైతం మంజూరు చేశారు. అయితే ఆధార్, రేషన్, పోడు భూముల పట్టాలు ఇస్తుండగా కరెంటు సౌకర్యానికి మాత్రం అటవీ శాఖ ససేమిరా అంటోంది. దీంతో 17 ఏళ్లుగా కరెంటు కావాలని అధికారులు, ప్రజాప్రతినిధుల వెంట పడుతూనే ఉన్నారు.

చీకట్లో కష్టాలు..

గత 17 సంవత్సరాలుగా కరెంటు లేక గ్రామస్తులు నానాకష్టాలు పడుతున్నారు. దీపాలతోనే కాలం గడుపుతున్నారు. రాత్రిపూట ఇళ్లలోకి పాములు వస్తుంటాయని వాపోతున్నారు. దోమలతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క ప్రభుత్వాలు పాఠశాలల్లో ఆన్‌లైన్, కంప్యూటర్ తరగతులు ప్రవేశపెడుతుండగా ఇక్కడ కరెంటు లేమీతో విద్యార్థులు ఆ చదువుకు దూరమవుతున్నారు. స్వచ్ఛంద సంస్థలు ఇచ్చే సోలార్ లైట్లు ఎక్కువ రోజులు ఉండడం లేదు. అంతర్గత రోడ్లతో పాటు, కరెంటు సౌకర్యం కల్పిస్తే తమ ఊరు సమస్యలు తీరినట్టేనని జిల్లా అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకుంటున్నారు.



ధ్వంసం చేసిన చేతిపంపు (ఫైల్)

బడి కాలబెట్టి, పంపు ధ్వంసం చేసి..

బాటన్ననగర్‌కు పాఠశాల కావాలని జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులు మొరపెట్టుకోగా ప్రత్యామ్నాయ పాఠశాలను మంజూరు చేశారు. ఆ గ్రామంలో గుడిసెను నిర్మించారు. ఈ క్రమంలో ఇది రిజర్వ్ ఫారెస్టు ఉండడానికే వీలు లేదంటూ ఫారెస్టు అధికారులు ఒత్తిడి చేస్తూనే రాత్రికి రాత్రి గుడిసెను కాలబెట్టారు. నిత్యం వాగు నీరు తాగుతుండగా ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి చేతిపంపును వేయిస్తే దానికి ధ్వంసం చేశారు. ఆ తర్వాత ప్రజాప్రతినిధుల చొరవతో చేతిపంపులు వేయించగా తాగు నీటి బాధలు తొలగిపోయాయి. ప్రత్యామ్నాయ పాఠశాలను మండల పరిషత్ పాఠశాలగా మార్చారు.



బాటన్న నగర్‌లో నిర్మించిన పాఠశాల

పిల్లలైనా వెలుగులో ఉంటారని..



మా ఊరికి కరెంటు వస్తే ముందుగా పిల్లల మంచిగా చదువుకుంటారు. వారైనా వెలుగును చూస్తారు. రాత్రి పూట నిద్ర సరిగ్గా ఉండదు. ఇంట్లోకి పాములొస్తున్నాయ్. ఏళ్లనుంచి ఇబ్బందులు పడుతూనే ఉన్నాం.

– మడకం నాగేష్, గ్రామస్తుడు

అధికారులు చొరవ చూపాలి



ప్రభుత్వం ఆధార్ కార్డులు, రేషన్‌కార్డులు, పోడు భూముల పట్టాలతో సైతం ఇచ్చింది. కరెంటు కావాలంటే ఫారెస్ట అధికారులు అడ్డుగా వస్తుండ్రు. మా బతుకులు చూసి అధికారులు చొరవ చూపాలి.

– పూకె రామ్‌లాల్

కాలం చెల్లినా.. విక్రయాలు



కాలం చెల్లిన బాదంపాల బాటిల్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో కాలం చెల్లిన పాల ఉత్పత్తుల విక్రయాలో జోరుగా సాగుతున్నాయి. వ్యాపారులు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారే తప్పా కొనేవారి ఆరోగ్యం గురించి కాస్తాయినా ఆలోచించడం లేదు. తాజాగా పట్టణంలో వారం రోజుల క్రితం ఓ వ్యక్తి పాల ఉత్పత్తుల దుకాణానికి వెళ్లి బాదం పాలు అడగగా కాలం చెల్లిన బాదం పాలు సీసాను ఇవ్వబోతుంటే దానిపై ఉన్న తేదీలను గుర్తించిన కొనుగోలుదారుడు ప్రశ్నించగా దుకాణాదారుడు వేరే బాటిల్‌ను ఇచ్చాడు. మళ్లీ అదే వ్యక్తి అదే దుకాణానికి వెళ్లి బాదం పాలు అడగగా మళ్లీ అదే బాదం పాల సీసాలను ఇచ్చేందుకు దుకాణాదారుడు యత్నించడంతో కొనుగోలు దారుడు అవాక్కయ్యాడు. ఈ తరహాలో కాలం చెల్లిన పాల ఉత్పత్తులు, తినుబండారాలు విక్రయాలు జోరుగా సాగుతున్నాయని సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వినతుల వెల్లువ

సీజనల్ వ్యాధులను అరికట్టాలని వినతి

అశ్వారావుపేటరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న విష జ్వరాలను అరికట్టాలని, దోమలను నిర్మూలించాలని కోరుతూ శుక్రవారం పీవైఎల్, పీవోడబ్ల్యూ మండల కమిటీల ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీ వైద్యులు విద్యాసాగర్‌కు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఆయా కమిటీల బాధ్యులు మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికి ఉచితంగా దోమతెరలు పంపిణీ చేయాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరారు. బాడిస లక్ష్మణ్‌రావు, కుంజా అర్జున్, కంగాల భూలక్ష్మీ, మంగరాజు, కొమరం భీమరాజు, వెంకటేష్, సోడెం కన్నారావు, కంగాల వెంకటేష్ పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలని..

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో శుక్రవారం ఏరియా ఎస్ఓటూ జీఎం డి.శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డి.నాసర్‌పాషా మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంగీలాల్, కార్మికులు వెంకట్‌నారాయణ, గురుమూర్తి, భావ్‌సింగ్, రామకృష్ణ, సాంబ, రవికుమార్ పాల్గొన్నారు.

సీతారామలో భూములు కోల్పోయామని..

సీతారామ ప్రాజెక్ట్‌లో భూమి కోల్పోయిన తమకు పరిహారం చెక్కులు అందించి న్యాయం చేయాలని కోరుతూ సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన భూ నిర్వాసితులు తహసీల్దార్ వి.రాఘవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 74లో తమకు భూమి ఉందని, ప్రాజెక్ట్ నిర్మాణంలో తమ భూమిని కోల్పోయామని, నేటి వరకు తమకు ఎలాంటి చెక్కులు అందలేదని వాపోయారు. ధర్మారావు, రాంబాబు, విజయ్‌కుమార్ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



కరకగూడెం: పరిసరాలు పరిశీలిస్తున్న సిబ్బంది

కరకగూడెం: పరిసరాల పరిశుభ్రతోనే ఆరోగ్యమని ప్రతి ఒక్కరూ విధిగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం 'ఫ్రైడే డ్రైడే' కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో పర్యటించి ఇంటి ఆవరణాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఫీవర్ సర్వే నిర్వహించి సుమారు 103 మందిని పరీక్షించి మందులు అందజేశారు. హెచ్ఈఓ క్రిష్టయ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చర్ల రూరల్: మండలంలోని పాతచర్ల అంబేడ్కర్ నగర్‌లోర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించి నిల్వ నీటిని పారబోయించారు. అదేవిధంగా అంబేడ్కర్ నగర్‌లో దోమల మందు పిచికారీ చేయించారు. నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి టి.సురేష్ అన్నారు.

మణుగూరు రూరల్: మండలంలోని కూనవరం పంచాయతీలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ సిబ్బంది పరిసరాలను పరిశీలించి, నిల్వ నీటిని తొలగించి శుభ్రం చేయించారు. అనంతరం వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను అందజేశారు. ఎస్‌యూఓ లింగ్యానాయక్, వైద్య సిబ్బంది రాంప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చర్లరూరల్: అంబేడ్కర్ నగర్‌లో ఫీవర్ సర్వే



మణుగూరు రూరల్: వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తహసీల్దార్ తనిఖీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

దుమ్ముగూడెం : మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాల, బీసీ బాలుర పాఠశాలలను తహసీల్దార్ అశోక్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా పాఠశాలలో బోర్ బావి పనిచేయక పోవడంతో వెంటనే మిషన్ భగీరథ ఏఈకి ఫోన్ ద్వారా సమాచారం అందించి మరమ్మతు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాపై సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించారు. ములకపాడు గ్రామంలోని వాటర్‌ప్లాంట్‌ను తనిఖీ చేశారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న సాబీర్ హుస్సేన్

బూర్గంపాడు: బూర్గంపాడుకు చెందిన నాయకులు సయ్యద్ సాబీర్ హుస్సేన్ శుక్రవారం ఎంపీ బలరాంనాయక్ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. గతంలో కాంగ్రెస్ మైనార్టీ విభాగం జిల్లా కన్వీనర్‌గా పనిచేసిన ఆయన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు అనుచరుడిగా పనిచేశారు. ఈ మేరకు ఎంపీ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

దుమ్ముగూడెం : మండలంలోని ఆర్లగూడెం ఆయుర్వేద వైద్యశాల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ తరుపున డాక్టర్ ఉషారాణి ఆధ్వర్యంలో ములకపాడు, కాటాయిగూడెం గ్రామాల్లో వైద్య శిబిరాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎం డాక్టర్ మహేష్‌గౌడ్, సిబ్బంది ఈశ్వరి, విజయ్‌కుమార్, కిషోర్, తనూజ, ఏఎన్ఎం అనిత, ఆశవర్కర్లు రమణ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

మణుగూరు రూరల్ : టూవీలర్ వెహికల్స్ మోటార్ యూనియన్ మండల కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రాపర్తి కొండయ్య, ఉపాధ్యక్షుడిగా కొత్తపల్లి శ్రీనివాస్, కార్యదర్శిగా యేసురత్నం, కోశాధికారిగా ఎలగందుల చరణ్‌లతో పాటు ఆరుగురు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పరిసరాలు ఇలా ఉంటే మీరు ఉంటారా?

- మున్సిపాలిటీ అధికారుల తీరుపై ఎమ్మెల్యే పాయం ఆగ్రహం



చెత్త తొలగింపుపై అధికారులకు ఆదేశాలిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఏ రోడ్డు వెంట చూసినా పిచ్చిమొక్కలు, చెత్త చెదారం, పూడికతీయని కాల్వలే కనిపిస్తున్నాయని, ఇలాంటి పరిసరాల్లో అధికారులు నివసిస్తారా అని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. మణుగూరు ఆదర్శ్‌నగర్‌లో శుక్రవారం పర్యటించిన ఆయన స్థానికులతో మాట్లాడగా వీధిలైట్లు, పిచ్చిచెట్లు, మురుగునీరు తదితర సమస్యలను విన్నవించారు. ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో గుర్తించిన ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా మున్సిపల్ అధికారులను రంగంలోకి దిగి పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని, అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. కాగా, సమితిసింగారం పంచాయతీ పరిధి మామిడిచెట్టు గుంపు విద్యానగర్, సమితిసింగారం, పాత పోలీస్ కాలనీ, రాజీవ్‌గాంధీ నగర్‌ల్లో రూ.26 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే పాయం ప్రారంభించారు. అలాగే, మణుగూరు, అశ్వాపురం మండలాలకు చెందిన పలువురికి రూ.2.92 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఏఈ సత్యనారాయణ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాస్, కార్యదర్శి శ్రీకాంత్, కాంగ్రెస్ మండల, పట్టణాధ్యక్షులు పీరినాకి నవీన్, శివసైదులు, నాయకులు అబ్దుల్లా, గణేశ్‌రెడ్డి, సామా శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, కూచిపూడి బాబు, కుర్రం రవి, పాతూరి వెంకన్న, పెనుగొండ సాంబశివరావు, చింతల కృష్ణ, లక్ష్మీనారాయణ, దొడ్డపనేని మధు, మెరుగు రవీందర్, రామారావు, కొర్సా ఆనంద్ పాల్గొన్నారు.

'మీ ఇంటికి.. మీ ఎమ్మెల్యే' కార్యక్రమం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

దమ్మపేట: 'మీ ఇంటికి మీ ఎమ్మెల్యే' కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు చెక్కును శుక్రవారం నేరుగా వారి ఇంటికి తీసుకొచ్చి అందించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన 20 కల్యాణలక్ష్మి, 23 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ' నీళ్లు మండలానికి ఇవ్వాలి



మాట్లాడుతున్న పెద్దిని వేణు

చంద్రుగొండ : సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలు మండలానికి ఇవ్వాలని సీపీఎం అనుబంధ రైతుసంఘం నాయకులు పెద్దిని వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు విప్పర్ల వెంకటేశ్వర్లు, రాయి రాజా, వీరభద్రం, లక్ష్మారెడ్డి ఉన్నారు.

ములకలపల్లికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్ గోదావరి జలాలను తొలుత మండలంలోని సాగుభూములకు అందించాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలపరిధిలోని పూసుగూడెం, కమలాపురంలో పంప్‌హౌస్ –2, 3 నిర్మించారని, ఇందుకుగాను రైతులు విలువైన భూములను కోల్పోయారని సీఎంకు కలిసి సమస్యను విన్నవించేందుకు ప్రయత్నించిన నాయకులను అరెస్ట్ చేయడం తగదన్నారు. రవికుమార్, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, మధు ఉన్నారు.

అక్రమ అరెస్టలను ఖండించండి



మాట్లాడుతున్న ఎన్డీ నాయకులు

సీతారామ ప్రాజెక్ట్ సాగునీటికి ఏజెన్సీ ప్రాంతాల సాగు భూములకు అందివ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి ఎస్‌కె. ఉమర్ డిమాండ్ చేశారు. గుట్టగూడెం గ్రామంలో సమావేశంలో వారు మాట్లాడారు. కుంజా కృష్ణ, కొండా కృష్ణ, వంకా సురేష్, దుబ్బా వెంకటేశ్, సవళ్ల ఆదినారాయణ, నాగరాజు, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దీక్షలు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలోని ఆదిమతెగల విద్య, వైద్యం, ఉపాధి రంగాల సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 30 నుంచి గోండ్వానా సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట దీక్షలను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర కన్వీనర్ సోందె వీరయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఐటీడీఏ పీఓతో పాటు ఆర్డీలకు జీఎస్పీ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, కాక జోగారావు, కనితి చంద్రుడు పాల్గొన్నారు.

హామీలను తక్షణమే అమలు చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మీ

మణుగూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణమే అమలుచేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ సభ్యురాలు డి.లక్ష్మీ అన్నారు. శుక్రవారం స్థానిక శ్రామికభవనంలో జరిగిన మండల మహసభలో ఆమె మాట్లాడుతూ.. పశ్చిమబెంగాల్‌లో మహిళా డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడి హత్య చేసినా ప్రధాని మోదీ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. రాష్ట్రం ప్రభుత్వం మహిళా సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదన్నారు. రెంటాల పావని, నాగమణి, కోంద్రు గౌరి, తోట పద్మ, నిర్మల, రామ, ముత్యాలు, ఐలమ్మ, ధనలక్ష్మీ, భాగ్యశ్రీ, నాగమణి ఉన్నారు.

హెచ్చరిక బోర్డు తొలగింపుపై ఫిర్యాదు

మణుగూరు రూరల్ : మండలంలోని గుట్టమల్లారం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 49 ప్రభుత్వ భూమిలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ హెచ్చరిక బోర్డ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించగా తహసీల్దార్ వి.రాఘవరెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. హెచ్చరిక బోర్డ్ తొలగించడం చట్టరీత్యా నేరమని, తొలగిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం

శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ ఇళ్లల్లో మహాలక్ష్మీ ప్రతిమను అందంగా అలంకరించి వివిధ రకాల పూలు, పండ్లు, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. శ్రావణ శుక్రవారం కావడంతో ఆలయాల్లో సైతం సందడి నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: పూజలు చేస్తున్న అర్చకులు



కరకగూడెం: పూజల్లో కుటుంబ సభ్యులు



అశ్వారావుపేటరూల్: పూజ చేస్తున్న మహిళ



అన్నపురెడ్డిపల్లి: బాలాజీ ఆలయంలో పూజలు..

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకుబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600
టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183